తంగెడ రోడ్డుకి మోక్షం


తంగెడ రోడ్డులో తారు పనులు

దాచేపల్లి: ఎట్టకేలకు తంగెడ రోడ్డుకి మోక్షం లభించింది. ఈ రోడ్డులో భారీ స్థాయిలో గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరమ్మతులకు రూ.5.70 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ నిధులతో ఆర్అండ్బీ అధికారులు పనులు చేపట్టారు. తంగెడ గ్రామంలో 900 మీటర్లు పూర్తిస్థాయిలో తారు రోడ్డు వేస్తున్నారు. దాచేపల్లి నుంచి తంగెడ కృష్ణానది రేవు వరకు గుంతలు పూడ్చి మరమ్మతులు చేస్తున్నారు. దాచేపల్లి నుంచి తంగెడ రేవు వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో దాచేపల్లి, ముత్యాలంపాడు, తంగెడ మీదుగా తెలంగాణలోని హుజూర్నగర్, కొదాడ, కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేట అక్కడ నుంచి విజయవాడకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో సిమెంట్ పరిశ్రమలు ఎక్కువగా ఉండడం వల్ల భారీ వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్రెడ్డి చొరవ తీసుకుని, రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయించి, నిధులు మంజూరు చేయించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు ప్రారంభం కాలేదు.

రూ.14.76 కోట్ల పురపాలిక బడ్జెట్ ఆమోదం


చైర్మన్ పోలూరి నరసింహారావు

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘం 2025–26 బడ్జెట్ను ఆమోదించారు. శనివారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షత వహించారు. మొత్తం రూ.14.76 కోట్లతో బడ్జెట్ అంచనాలు రూపొందించారు. ఇందులో రూ.13 కోట్లు ఖర్చు కాగా, రూ.1.72 కోట్లు మిగులు అంచనా వేశారు. తాగునీటి సరఫరా, సిబ్బంది జీతాలు, సచివాలయాల అద్దెలు, స్థానిక ఎన్నికల నిర్వహణ ఖర్చు, రోడ్ల మరమ్మతులు, ప్రధాన రహదారులు, వీధి లైటింగ్ మెటీరియల్, కల్వర్టులకు బడ్జెట్లో నిధులు కేటాయించారు. ట్రై సైకిళ్ల పంపిణీ, ఇతర ఖర్చులకు బడ్జెట్ను ఉపయోగించనున్నట్లు వెల్లడించారు. కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యంలో ఆర్వో వెంగయ్య బడ్జెట్ ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు జి.అరుణకుమారి, కె.జ్యోతి, జగన్నాథం, ఎన్.శ్రీనివాసరావు, షేక్ సుభాని, అనిత పాల్గొన్నారు. పురపాలక సంఘ డీఈ సుభాని, ఏఈ గౌతమి, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజా, పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

కోతలు ముమ్మరం..కొనుగోళ్లు మందగమనం

- కోతకు సిద్ధంగా ఉన్న కంది పంట
- మార్కెట్ ధరలు చూసి రైతుల ఆందోళన
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు సిద్ధం..
- అక్కడా కొనుగోళ్లు మందగించడంతో సందిగ్ధంలో కర్షకులు


ఒప్పిచర్లలో కోతకు సిద్ధంగా ఉన్న కంది పంట

కారెంపూడి: రబీ కంది నూర్పిడులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంట ఇళ్లకు చేరుతోంది. గతేడాది కల్లాల్లోనే కందులను కొన్న వ్యాపారులు..ఈ ఏడాది ముఖం చాటేస్తున్నారు. బయట మార్కెట్కు తీసుకెళ్తే.. తక్కువ రేటు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. అక్కడి కంటే పంటకు ప్రభుత్వ మద్దతు ధర ఎక్కువగా ఉండడంతో అటు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మార్క్ఫెడ్కు కందులు ఎలా అమ్ముకోవాలనే దానిపై చాలా మంది రైతులు ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ కూడా కొనుగోళ్లు మందగింజడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది.

మందకొడిగా కొనుగోళ్లు

అయితే ఆశించిన స్థాయిలో కందుల కొనుగోలు ప్రక్రియ సాగడం లేదు. మండలంలోని పేటసన్నెగండ్ల, ఒప్పిచర్ల, మిరియాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పేటసన్నెగండ్లలో మాత్రమే ఇప్పటికి 1,200 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. వాస్తవానికి మండలంలో 3 వేల ఎకరాల్లో రబీ కంది సాగైంది. ఎకరాకు సగటున 6 క్వింటాళ్లు వేసుకున్నా.. 18 వేల క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ఇదే లెక్క సాగర్ ఆయకట్టు ఉన్న అన్ని ప్రాంతాలకు వర్తిస్తుంది. నీటి పారుదల ఉన్న భూముల్లోనే 6 నుంచి 12 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తోంది. వర్షాధారంగా వేసిన కంది గత డిసెంబరులో పడిన వర్షాలకు బాగా దెబ్బతినడంతో ఆ ప్రభావం దిగుబడులపై పడింది. అయితే నీటి పారుదల ఉన్న భూముల రైతులు.. సస్యరక్షణ చేపట్టి మళ్లీ పంట పండించారు. పల్నాడు జిల్లాలో ఖరీఫ్లో 48 వేల ఎకరాల్లో కంది సాగవగా.. రబీలో మరో 20 వేల ఎకరాల్లో అధికంగా కంది సాగైంది. నీటి పారుదల ఉన్న కంది రైతులు ఇప్పుడే కోతలు కోస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి వచ్చిన కందులను రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు చేయాల్సిన తక్షణ అవసరం కన్పిస్తోంది.

మిగులు అంతంత మాత్రమే..

గతేడాది కందులు క్వింటా బహిరంగ మార్కెట్లో గరిష్ఠంగా రూ.11 వేల దాకా పలికాయి. ప్రభుత్వం కూడా రూ.9,650 వరకు మద్దతు ధర ప్రకటించింది. దీంతో కంది సాగులో మిగులు కనిపించడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పంట కోతకొచ్చే సమయానికి రేటు లేకుండా పోవడంతో రైతులు డీలా పడుతున్నారు. ఎటూ ముందుగా కుదుర్చుకున్న విదేశీ ఒప్పందాల ప్రకారం ఇతర దేశాల నుంచి మినుములు, పెసలు, కందులు దిగుమతి అవుతూనే ఉన్నాయి. ఇక్కడేమో సాగు విస్తీర్ణంతో పాటు రైతులు కష్టపడి దిగుబడులు కూడా పెంచుతున్నారు. ఈ పరిస్థితి వెరశి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రైతుకు ఎకరాకు రూ.10 వేలు కూడా మిగలని పరిస్థితులు ప్రస్తుతం కన్పిస్తున్నాయి. అది కూడా ప్రభుత్వ మద్దతు ధరకు అమ్మితేనే గిట్టుబాటు అవుతోంది. లేకుంటే బయట మార్కెట్లో ధర రూ.6,500కు మించడం లేదు. ఈ ధరల వ్యత్యాసం కూడా రైతుల అమాకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొని మార్క్ ఫెడ్కు ఎక్కువ ధరకు అమ్మే వాతావరణానికి దారితీస్తోంది.

ఇలా నమోదు చేసుకోవాలి

కంది వేసిన రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. వారిచ్చిన షెడ్యూల్ ప్రకారం డీసీఎంఎస్ ప్రతినిధులు వచ్చి కందుల నాణ్యతను పరీక్షిస్తారు. క్వింటా రూ.7,550కి కొనుగోలు చేసి 15 రోజుల లోపు నగదును రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

రైతుల వద్దే నేరుగా కొనుగోళ్లు

రైతుల నుంచి మాత్రమే మద్దతు ధరకు కందులు కొనుగోలు చేస్తాం. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తాం. అయితే కందులు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండాలి. 12 శాతం లోపు తేమ, ఇతర వ్యర్థాలు 2 శాతం లోపు ఉండాలి. తినదగిన ఇతర పంటల గింజలు 4 శాతం లోపు, దెబ్బతిన్న, తయారు కాని గింజలు, పాక్షికంగా దెబ్బతిన్న గింజలు అన్నీ కలిపి 10 శాతం లోపుంటే వాటిని డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. మిషన్ ద్వారా కంది కోసిన తర్వాత పంటను ఆరబెట్టాలి. తగిన నాణ్యతా ప్రమాణాలు వచ్చిన తర్వాత శాంపిల్స్ పీఏఏలకు అందిస్తే వారు మార్క్ఫెడ్ ప్రతినిధులను రప్పించి కొనుగోలు చేయిస్తాం.

– బత్తుల యలమందారెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి, కారెంపూడి

పీ–4 సర్వేపై వార్డు సభ



పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం పీ–4 సర్వే నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని చెరువుకట్ట బజారు సచివాలయంలో పీ–4 సర్వేలో భాగంగా శనివారం వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దాతల సాయంతో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి అందిచాలనే లక్ష్యంతో పీ– 4 సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు భాగస్వాములై అభివృద్ధిలో ముందడుగు వేయాలని సూచించారు.

రేషన్ కార్డుదారులు ఈ–కేవైసీ చేయించుకోవాలి

రెంటచింతల: రేషన్ కార్డుల్లో పేరు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ మూఢావత్ అర్జున్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాయలంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని 11 గ్రామాల్లో మొత్తం 43,972 మంది పేర్లు రేషన్ కార్డుల్లో ఉన్నప్పటికీ 39,164 మంది మాత్రమే ఈ–కేవైసీ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన 4,803 మంది జాబితాను రేషన్ డీలర్ల వద్ద ఉందని చెప్పారు. వారు కూడా త్వరగా త్వరగా ఈ–కేవైసీ చేయింకోవాలని సూచించారు. లేకపోతే వారు ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోవడంతో పాటు రేషన్ కార్డులనూ తొలిగించడం జరుగుతుందని హెచ్చరించారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి


శాలివాహన చక్రవర్తి, మొల్ల చిత్రపటాలకు నివాళి

రెంటచింతల: మండల కేంద్రంలో ఆంధ్రుల ప్రథమ చక్రవర్తి శాలివాహనుడి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శాలివాహనుడి చిత్రపటానికి శాలివాహన సంఘం నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్రులను ఏకతాటిపై తీసుకువచ్చి, మంచి పరిపాలన అందించిన శాలివాహనుడిని ఆయన జయంతి, వర్ధంతి రోజున ఆంధ్రులు స్మరించుకోవడం మరువకూడదన్నారు. భారత ప్రభుత్వం 1957 మార్చి 22 నుంచి చంద్రమాన కాలెండర్ ఆధారంగా శక సంవత్సరాన్ని జాతీయ సంవత్సరంగా స్వీకరించిందన్నారు. శక సంవత్సరం క్రీస్తు శకానికి 78 సంవత్సరాలు వెనుకబడి ఉంటుందని చెప్పారు. అనంతరం తొలి తెలుగు మహిళా కవయిత్రి కుమ్మరి మొల్లమాంబ జయంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పులిహోర పంపిణీ చేశారు. శాలివాహన మండల కన్వీనర్ సన్నెగంటి సిద్దయ్య, సంఘం నాయకులు నారాయణపురం శ్రీనివాసరావు, బంకూరి తిరుపతిరావు, బాపనపల్లి నాగేశ్వరరావు, సన్నెగంటి పోతులూరి పాల్గొన్నారు.

27న వైస్ ఎంపీపీ ఎన్నిక

కారెంపూడి: మండల ప్రజా పరిషత్తు ఉపాధ్యక్షుని ఎన్నిక ఈ నెల 27న జరుగుతుందని ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వైఎస్ ఎంపీపీ కోకా అక్కమ్మ మృతి చెందడంతో ఈ ఎన్నిక జరగనుందని తెలిపారు. అలాగే నరమాలపాడు, ఒప్పిచర్ల, ఇనుపరాజుపల్లె, కారెంపూడి, చింతపల్లి, పేటసన్నెగండ్ల, కాచవరం, చినగార్లపాడు గ్రామ పంచాయతీలకు ఉప సర్పంచ్ల ఎన్నికలు కూడా అదే రోజు జరుగుతాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు.

25 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కారెంపూడి: మండల కేంద్రంలో ఈ నెల 25న ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తహసీల్దారు వెంకటేశ్వర్లు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలకు ఆధార్ నమోదు, బయో మెట్రిక్ అప్డేట్, పుట్టిన తేదీల్లో సవరణలకు, అడ్రస్ మార్పు తదితర సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. 26న ఒప్పిచర్లలో, 27న మిరియాల, 28న నరమాలపాడు గ్రామంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరుగుతాయని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్


అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దారు కిరణ్కుమార్

మాచర్ల రూరల్: దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు కిరణ్కుమార్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పొలాలకు, స్థలాలకు సంబంధించి 1బీ అడంగల్లో పేరు మార్పు, హద్దుల మధ్య తేడా, ఒకే నంబరుపై ఇరువర్గాలకు పాస్పుస్తకాల పంపిణీ, ఒకరిపొలంలో మరొకరు ఉండి అన్యాక్రాంతం వంటి సమస్యలపై ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఇరువర్గాలు చేసుకున్న ఐదు అర్జీలను పరిశీలించి, తగు పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరువర్గాలకు సంబంధించి న్యాయవాదులు హాజరయ్యారు. వారి వాదనలు వినిపించినట్లు తెలిపారు. ఇలాంటి సమస్యలపై ప్రతి శనివారం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్లు బత్తుల వాణి, రమణ, ఆర్ఐ ఇక్కుర్తి అనిల్కుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

గురజాల: విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో శనివారం మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లపై లైంగిక దాడులు, వేధింపుల నివారణకు 2012లో చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. అడిషనల్ జూనియర్ జడ్జి పి.అలేఖ్య, న్యాయవాది షేక్ జానీ బాష ఉన్నారు.

సేద్యపు కుంటల పనులు ప్రారంభం


సేద్యపు నీటి కుంట తవ్వకం ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఫణికుమార్ నాయక్

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రపంచ జల దినోత్సవంలో భాగంగా ఫాం పాండ్స్ పనులను ప్రారంభించినట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి తెలిపారు. శనివారం ఆమె గోలి గ్రామంలో నీటి కుంటల పనులను పరిశీలించి, మాట్లాడారు. మండలంలోని గ్రామానికి 15 నీటి కుంటల చొప్పున 11 గ్రామాల్లో 165 కుంటలు తవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రూ.33 లక్షల విలువైన 66 నీటి కుంటల ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు వెల్లడించారు. కూలీలకు పూర్తిగా వేతన రూపంలో చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. పంట పొలాల్లో నీటి కుంటలు తవ్వించుకోవాలని ఆసక్తి కలిగిన రైతులు వారి వివరాలను స్థానిక ఉపాధి హామీ కార్యాలయం నందు ఇవ్వాలని చెప్పారు. ఈవోపీఆర్డీ చినుకూరి శ్రీనివాసరావు, ఉపాధిహామీ పథకం ఏపీవో జి.జయచంద్రకుమార్, బీఎఫ్టీ ఏసీహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని కారెంపూడిలో నీటి కుంట నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ కసిన్యా నాయక్, ఏపీఓ కోటిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలో అవసరమైన చోట భూగర్భ జల వనరుల సంరక్షణతో పాటు ప్రజల అవసరాల తీర్చడానికి కుంటల తవ్వకం పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ కోటిరెడ్డి పేర్కొన్నారు.

మాచర్ల రూరల్: ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకుని అన్ని గ్రామ పంచాయతీల్లో సేద్యపు నీటి కుంటల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీవో ఆర్.ఫణికుమార్ నాయక్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని కంభంపాడు, మాయవరం, గన్నవరం గ్రామాల్లో సేద్యపు నీటి కుంటల పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో సేద్యపు నీటి కుంటల నిర్మాణం జరపాలని, ఉపాధి హామీ పనుల ద్వారా నీటి పొదుపు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నాగశ్రీనివాస్, ఇంజినీర్ గోపి, టెక్నికల్ అసిస్టెంట్లు లూర్దుబాబు, కిషోర్, గ్రామ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ వేముల లక్ష్మి పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గురజాల రూరల్: మండల పరిధిలోని గంగవరం గ్రామంలో కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్లైన్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 11న చివరి తేదీ అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కొరకు పాఠశాలలో సంప్రదించాలని తెలిపారు.

భక్తుల కల్పవల్లి నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు

- నేడు ఘనంగా అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం
- రెండు రోజులు వైభవంగా ఉత్సవాలు
- భక్తుల రాక సందర్భంగా ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యేక ఆకర్షణగా కొలువు దీరనున్న కుంకుమ బండ్లు


శ్రీలక్ష్మీ అమ్మవారి సన్నిధి

దుర్గి: మహిమాన్విత తల్లి నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్లు ఆదివారం ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి కుంకుమ బండ్లు ఆలయ సన్నిధికి చేరేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని అడిగొప్పుల గ్రామ సమీపంలో నిదానంపాడులో కొలువైన పార్వతీదేవి అవతారమైన శ్రీలక్ష్మీ అమ్మవారికి మొక్కులు సమర్పించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు.

పార్వతీ దేవి అవతారం శ్రీలక్ష్మి తల్లి..

నందీశ్వరుడి తండ్రి శిలాదుని శాప ఫలితంగా నిదానంపాటిలో యాగంటి రామయ్య, సుగుణమ్మ దంపతులకు పార్వతీదేవి జన్మనించింది. ఆమెకు శ్రీలక్ష్మి అని నామకరణం చేశారు. ఆమె జన్మానికి ముందే రామయ్య ఇంట ఒక గోమాత ఉంటుంది. గ్రామ పెద్ద అయిన ఆయనకు నలుగురు మగ సంతానం. శ్రీలక్ష్మిని అల్లారుముద్దుగా పెంచారు. శ్రీలక్ష్మి ప్రతి రోజూ తన గోశాలలోని గో పంచకాన్ని తన 12వ ఏట వరకు స్వీకరించేది. ఒక రోజు ఓ ఆంబోతు గోశాలలో గోవుతో క్రీడించిన అనంతరం శ్రీలక్ష్మి ఎప్పటిలాగే గోపంచకం స్వీకరించింది. దీంతో ఆంబోతు వీర్యకణాలు అందులో కలిసి శ్రీలక్ష్మీ గర్భంలోకి ప్రవేశించగా.. ఆమె గర్భం దాలుస్తుంది. శ్రీలక్ష్మి శరీరంలో మార్పులు గమనించిన కుటుంబ సభ్యులు తమ పరువు మర్యాదలు పోతాయని బాధపడ్డారు. దీంతో తోబుట్టువులే ఆమెను అంతమొందించాలని ఆలోచన చేస్తారు. ఓ రోజు పొలానికి అన్నం తీసుకొచ్చిన శ్రీలక్ష్మీని గడ్డివామి పైకి ఎక్కడి సర్దమని సోదరులు చెబుతారు. ఆమె పైకి ఎక్కగానే అదే అదనుగా చూసి అన్నలు గడ్డివాముకు నిప్పు పెట్టి శ్రీలక్ష్మిని దహనం చేస్తారు. అన్నలారా..! నేను ఏ పాపము ఎరుగను..! నన్ను ఇలా దహనం చేయడం భావ్యమా అంటూ విలపిస్తూ ఆమె అగ్నికి ఆహుతి అవుతుంది. ఈ క్రమంలో అగ్ని కీలల దహనంతో శ్రీలక్ష్మీ గర్భం నాలుగు ముక్కలుగా చీలి నాలుగు కాళ్లతో శిరస్సు మీద మచ్చతో ఒక కోడే దూడ మరణించి భూమిపై పడుతుంది. ఈ దృశ్యం చూసిన ఆమె అన్నలు తమ నేత్రాలు కోల్పోతారు. గోవు అంబా అని అరచి అగ్నిలోకి దూకి తాను ఆహుతవుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు భీకర శబ్దంతో భూమి బారెడు వైశాల్యంతో చీలి సువర్ణ విగ్రహం వెలుగులతో వస్తుంది. అప్పటి నుంచి ప్రతి ఆదివారం పసుపు కుంకుమతో పూజించాలని అమ్మవారు భక్తులను ఆదేశిస్తుంది. తనకు ఆలయం కట్టవద్దని, తనను దర్శించిన భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, ఇలవేల్పుగా అండగా ఉంటానని వివరించినట్లు పురాణాల కథనం.


శ్రీలక్ష్మీ అమ్మవారి చిత్రపటం

ఘనంగా ఉత్సవాలు

పాల్గుణ పౌర్ణమికి దగ్గరగా ఉండే ఆదివారం ఏటా శ్రీలక్ష్మీ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మొదటిగా పుట్టిల్లు అయిన యాగంటి వారి కుంకుమ బండి ఆలయం వద్దకు వస్తుంది. అనేక ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారు. అమ్మవారి ఉత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. సంతానం లేని వారు అమ్మవారిని దర్శిస్తే సంతానం కలుగుతుంది. కొత్త వాహనాలు కొనుగోలు చేసిన వారు ఇక్కడ పూజలు చేయిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని భక్తుల నమ్మకం.

కుంకుమ బండ్లు ప్రత్యేక ఆకర్షణ

అడిగొప్పల, ఓబులేశునిపల్లె, నరమాలపాడు, వివిధ గ్రామాల నుంచి కుంకుమ బండ్లు సుమారు 30కి పైగా వస్తాయి. ఒక్కో బండి నిర్మాణానికి రూ.3 నుంచి రూ.4 లక్షల గ్రామస్తులు వ్యయం చేస్తారు. తమ గ్రామాల నుంచి బయలు దేరే క్రమంలో నియమ నిష్టలతో పూజలు చేసి, ఎటువంటి విఘ్నాలు కలగకుండా అందరూ ఏకతాటిపై బండిని తోడ్కొని ఆలయం వద్దకు వస్తారు. ఆలయంలో మూడు ప్రదక్షిణలు చేసి, తమ భక్తిని చాటుకుంటారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు వేడుకలు ఘనంగా జరుగుతాయి. మాచర్ల, పిడుగురాళ్ల డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.